క్లుప్తంగా

అల్లాడి మోహన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న మోహన్

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రి మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ డాక్టర్ అల్లాడి మోహన్‌కు ఏపీ అపికోన్ రాష్ట్ర చాప్టర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. శనివారం ఈ మేరరకు కడపలో నిర్వహించిన అపికోన్ రాష్ట్ర స్థాయి వార్షిక సమావేశంలో పురస్కారం ప్రదానం చేశారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు

దామలచెరువులో పింక్ బస్ సేవలు రేపు

పాకాల : మండలంలోని దామలచెరువులో స్విమ్స్ ఆస్పత్రి వారు సోమవారం పింక్ బస్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు అరవింద్‌కుమార్, రవిరామ్ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ క్యాంప్ ప్రారంభమవుతుందని, వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ తెచ్చుకోవాలని సూచించారు. బీసీ, షుగర్ పరీక్షలతో పాటు నోటి, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపట్టనున్నట్లు వివరించారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షల విరాళం



డీడీ అందిస్తున్న దాత ప్రతినిధి

తిరుమల: తమిళనాడు రాష్ట్ర మంత్రి కెఎన్ నెహ్రూ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షలను శనివారం విరాళంగా అందించారు. నవంబర్ 9న తన పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాదం వితరణకు అయ్యే ఖర్చును ఇచ్చారు. ఆయన ప్రతినిధి సురేష్ తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీని అందజేశారు.

అదాలత్‌లో 94 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి పూర్ణిమాదేవి

పాకాల : స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 94 కేసులను న్యాయమూర్తి పూర్ణిమాదేవి పరిష్కరించారు. కక్షిదారులకు రూ.37,82లక్షల లబ్ధి చేకూరినట్లు న్యాయమూర్తి వెల్లడించారు. న్యాయవాదులు గురుస్వామినాయుడు, గౌరీశంకర్‌రాజు, సలీమ్, సాయితేజమున్ని, సుబ్రమణ్యంరెడ్డి, రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

కార్గో గదికి మరమ్మతు

తిరుపతి అర్బన్ : శ్రీహరి బస్టాండ్ కూల్చివేత నేపథ్యంలో కార్గో బుకింగ్ పాయింట్‌ను డీపీటీవో కార్యాలయం కింది భాగంలోని గదుల్లోకి మార్చారు. అయిత ఈ గదులు ఉరుస్తుండడంతో శనివారం మరమ్మతు పనులు చేపట్టారు.

ఐసీడీఎస్ ఆశ్రయంలో యువతి



పాకాల : మండలంలోని కుందేటిపల్లెలో మానసిక స్థితి సరిగా లేని యువతిని స్థానికులు గుర్తించి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. శనివారం సాయంత్రం ఈ మేరకు అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని యువతిని సురక్షితంగా తమ కార్యాలయానికి తీసుకువచ్చారు. సూపర్‌వైజర్ కిరణ్మయి మాట్లాడుతూ యువతి ఎలాంటి వివరాలు చెప్పలేకపోతోందని, సమాచారం తెలియగానే కుటుంబీకుల వద్దకు చేరుస్తామని వెల్లడించారు.

తుడా చైర్మన్‌తో ఐఐటీ బృందం భేటీ



తిరుపతి తుడా : తిరుపతి ఐఐటీ బృందం శనివారం తుడా కార్యాలయంలో చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డిని కలిసి పలు అంశాలపై చర్చించింది. తారు రోడ్లకు ప్రత్యామ్నాయంగా కొత్త మెటీరియల్‌తో రహదారుల నిర్మాణంపై ప్రజెంటేషన్ ఇచ్చింది. సమావేశంలో ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ, రీసెర్చ్ స్కాలర్లు నీతూ జి కుమార్, హర్మన్‌దీప్ కౌర్, స్ఫూర్తి, గంగాధర్, విజయ పద్మాకర్ పాల్గొన్నారు.

సమస్యలపై పోస్టు కార్డు ఉద్యమం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తిరుపతి కల్చరల్ : భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నేతలు శనివారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు పోస్టు కార్డులు రాసినట్లు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూ నేత ఎన్‌డీ.రవి తెలిపారు. వైకుంఠపురం ఆర్చి సమీపంలోని పోస్ట్ బాక్స్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ క్లెయిమ్ నిధులను తక్షణమే మంజూరు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు హరిబాబు, రవి, స్ట్రీట్ వెండర్స్ సంఘం నేతలు ఎం.శ్రీనివాసులు, ఆదామ్, వీర, వెంకటేష్ పాల్గొన్నారు.

నదీ తీరం.. పచ్చనేతల పరం!



ఆక్రమిత భూమిలో అక్రమ కట్టడం

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఇష్టారాజ్యంగా భూదోపిడీకి పాల్పడుతున్నారు. చివరకు నదీ పోరంబోకు భూములను సైతం యథేచ్ఛగా కబ్జా చేసేస్తున్నారు. అక్రమంగా ప్లాట్లు వేసి అమాయకులకు అంటగట్టేస్తున్నారు. రూ.కోట్లు జేబులో వేసుకుని దర్జాగా వెళ్లిపోతున్నారు. స్థలాలు కొనుగోలు చేసిన వారు మాత్రం లబోదిబోమంటున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువై దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఈ మేరకు స్వర్ణముఖి తీరం.. పచ్చనేతల పరమవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పైగా ఎవరినీ అటువైపు రానీయకుండా అక్రమార్కులకు పూర్తిగా సహకారం అందిస్తున్నారు.

- యథేచ్ఛగా స్వర్ణముఖ పరిసర పోరంబోకు భూముల కబ్జా
- ఆక్రమించి గుట్టుగా అమ్మేస్తున్న తమ్ముళ్లు
- కొనుగోలు చేసి లబోదిబోమంటున్న బాధితులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ సంస్కృత నగర్ వద్ద స్వర్ణముఖి నదీతీరంలోని భూముల్లో పచ్చనేతలు పాగా వేశారు. చిగురువాడ ఉత్తరపు కండ్రిగ గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 275/1, 275/2, 275/3, 275/4, 274/3లోని నదీ పోరంబోకు భూములను స్థానికుడైన బీసీ వర్గానికి చెందిన టీడీపీ నేత కాజేశాడు. ఆక్రమిత భూమిలో ఇప్పటికే పది ప్లాట్లు అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. మూడు, నాలుగు రోజుల నుంచి మరో ఐదు ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాడు. ఆక్రమిత భూములను ప్లాట్లుగా మార్చి గుట్టుగా అమ్మేస్తుండడంతో తక్కువ ధరకు వస్తాయన్న ఆశతో బయటి వ్యక్తులు అక్కడ స్థలాలు కొనుగోలు చేశారు. ఇప్పటికే ఆక్రమిత భూమిలో కట్టిన ఇళ్లకు గతంలో కార్యదర్శులుగా పనిచేసిన వారు అడ్డగోలుగా ఇంటి పన్నులు కూడా ఇచ్చినట్టు సమాచారం. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి రూ.కోట్లు విలువ చేసే నదీ పోరంబోకు భూములను కబ్జా దారులకు కట్టబెట్టేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణం నదీ పోరంబోకు భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించకుంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు.

రూ.కోట్లు విలువైన భూములు మాయం

తిరుపతి నగర శివార్లలోని మఠం, కాలువ, డీకేటీ భూములు, చెరువులు, కుంటలు, వాగులు, నదులు, బంజరు భూములను సైతం కాజేసిన కబ్జా రాయుళ్లు తాజాగా స్వర్ణముఖి నదీ పరివాహక భూములపై కన్నేశారు. ఎన్నో ఏళ్లుగా దర్శన మిచ్చిన బీడు భూములన్నీ ఏడాదిగా అన్యాక్రాంతమైపోతుండడంతో గ్రామ అవసరాలకు భూములు కరువవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిగురువాడ ఉత్తరపు కండ్రిగ పరిధిలో అక్రమ కట్టడాలను తొలగించకుంటే ఉద్యమానికి దిగుతామని స్పష్టం చేస్తున్నారు.



కబ్జా భూమిలో మట్టితోలి చదును చేయించిన దృశ్యం

నోటీస్ బోర్డు

- తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జాతీయ మహిళా సాధికార సదస్సు.
- మహతి కళాక్షేత్రంలో ఉదయం 9.30 నుంచి 6 గంటల వరకు జాతీయ స్థాయి నృత్య పోటీలు, రాత్రి 8 గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానం.
- నగరవనం ఆవరణలో ఉదయం 7.45 గంటలకు బీవీ రమణ రచించిన తిరుపతి నగరవనం పుస్తకావిష్కరణ.
- ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు బలిజసేన రాష్ట్ర కమిటీ సమావేశం.
- పెద్దకాపు వీధిలోని యూటీఎఫ్ భవన్‌లో సాయంత్రం 4 గంటలకు మనువాదం-దళితులు అనే అంశంపై సదస్సు.

టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

తిరుమల : టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయశాఖ సెక్రటరీ హరి జవహర్ లాల్, సభ్యుడిగా సుదర్శన్ వేణు శనివారం శ్రీవారి ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అదనపు ఈఓ అందించారు. డిప్యూటీ ఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనలో విఫలం



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : గంజాయి నిర్మూలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వామపక్ష, ప్రజా సంఘాల నేతలు విమర్శించారు. తిరుపతి ప్రశాంతతను కోరుతూ శనివారం నగరంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. సీపీఐ నేతలు రామానాయుడు, పి.మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత పి.వెంకటరత్నం, ఆర్‌పీఐ దక్షిణాది అధ్యక్షుడు పి.అంజయ్య, కాంగ్రెస్ నేత చిట్టిబాబు ప్రసంగించారు. రౌడీమూకల నుంచి తిరుపతిని కాపాడడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. రౌడీలు భూ కబ్జాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నేతలు విశ్వనాథ్, పెంచలయ్య, రాధాకృష్ణ, బండి చలపతి, ఉదయ్‌కుమార్, సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, బుజ్జి, డీఎంసీ భాస్కర్, ఆర్.వెంకయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రాజారెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని లింగనపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ రాజారెడ్డి(85) శుక్రవారం అకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి శనివారం లింగనపల్లెకు చేరుకుని రాజారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం, నేతలు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్ రెడ్డి, రహీం, వినాయక, గణపతిరెడ్డి, బాబు రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, సునీల్, రమేష్, భక్తభూపాల్ చౌదరి, శీనునాయుడు, వరదారెడ్డి, రుకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్ విద్యార్థుల విజయకేతనం



టాపర్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ జే ప్రకాష్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ విడుదల చేసిన ఎంసీఏ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో బైరాగిపట్టెడలోని రిమ్స్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. కళాశాల విద్యార్థిని పి.సరస్వతి 8.95 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటుచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు పావని 8.65, లహరి 8.56, పల్లవి 8.54, యామిని 8.50 జీపీఏ సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. అలాగే ఎస్వీయూ విడుదల చేసిన ఎంబీఏ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో పావని 7.84 జీపీఏ మార్కులతో టాపర్‌గా నిలిచిందని, ఆర్.హేమలత, జయపాల్, పల్లవి అత్యుత్తమ ఫలితాలను సాధించారని తెలియజేశారు. అనంతరం టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు యాజమాన్యం, ప్రిన్సిపాల్ నగదు బహుమతి అందజేసి చైర్మన్ కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనంద్ రెడ్డి, డైరెక్టర్ విజయ్ రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

కళా సంపదే సంస్కృతికి దర్పణం

తిరుపతి కల్చరల్ : భారతీయ సంస్కృతికి కళా సంపదే దర్పణమని, ఈ మేరకు భావితరాలకు అందించి కళా వికాసానికి తోడ్పడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు శనివారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏ.మోహన్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి పాల్గొని నాట్య గురువులు ఎస్.లక్ష్మీశంకర్, పి.శైలజారెడ్డికి నాట్య విద్వన్మణి అవార్డులు, ఏడుగురు కళాకారులకు చైల్డ్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి , కార్యదర్శి కేఎన్ రాజా, ఆమూరి సుబ్రమణ్యం, రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, సిద్ధేంద్రశర్మ పాల్గొన్నారు.

సదస్సుకు సర్వం సిద్ధం



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి అర్బన్ : మహిళా సాధికారితపై పార్లమెంటరీ,శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సుకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోలీసు విభాగం, ట్రాఫిక్ సిబ్బంది, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.మొదటి రోజు ఆదివారం తిరుచానూరు మార్గంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.50 గంటలకు లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, జిల్లా ఇంచార్జి మంత్రి, శాసన వ్యవహారాల శాఖ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, పార్లమెంట్,అసెంబ్లీల మహిళా సాధికారిత కమిటీ చైర్‌పర్సన్లు పాల్గొంటారని వివరించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విందు అనంతరం ముఖ్యమంత్రి 2.15కు తిరుగు ప్రయాణమవుతారని తెలిపారు. 1.30 4.30 గంటల వరకు సదస్సులో మహిళా సాధికారత ప్రధాన అంశాలపై చర్చిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమం అనంతరం రాత్రి 7.30 గంటలకు చంద్రగిరికోట కమిటీ సభ్యులకు అసెంబ్లీ స్పీకర్ అతిథ్యమిస్తారన్నారు. రెండవ రోజు సోమవారం ఉదయం 10 గంటలకు గవర్నర్, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్‌పర్సన్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, సాధికారిత కమిటీలు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి తుడా : నగరంలో నిర్వహించనున్న జాతీయ మహిళా సాధికార సదస్సుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శనివారం ఈ మేరకు తిరుచానూరు మార్గంలోని రాహుల్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సదస్సుకు హాజరవుతున్న పార్లమెంటరీ లెజిస్లేటివ్ కమిటీ సభ్యులకు వసతి కల్పించినట్లు వెల్లడించారు. ఒక్కో ప్రతినిధికి ప్రత్యేకంగా లైజన్ ఆఫీసర్‌ను నియమించినట్లు చెప్పారు. చంద్రగిరి కోటలో కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

సంస్కరణ చైతన్యం 'ఉగ్గుపాల నుండే'



పుస్తకావిష్కరణలో సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్ : సమాజంలో వ్యవస్థల స్థితిగతులను ప్రశ్నించిన సంస్కరణ చైతన్యం ఉగ్గుపాల నుండే కవితా సంపుటి అని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. శనివారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన ఉగ్గుపాల నుంచే కవితా సంపుటిని ఆవిష్కరించారు. సినీ నేపథ్య గాయకుడు పుట్టా పెంచలదాసు ముఖ్య అతిథిగా, సాహితీ వేత్తలు తిరువాయిపాటి రాజగోపాల్, ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, గంగవరం శ్రీదేవి, సాకం నాగరాజు, టింకాయల దామోదరం, పల్లిపట్టు నాగరాజు, అంకమనాయుడు వక్తలుగా హాజరయ్యారు. పెంచలదాసు మాట్లాడుతూ మట్టి వాసన తెలిసిన మనిషిగా, గ్రామీణ వాతావరణం, రైతు బతుకును ఆవిష్కరించిన అభ్యుదయ కవి పేరూరు బాలసుబ్రమణ్యమని ప్రశంసించారు. సాహితీవేత్తలు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, మల్లారపు నాగార్జున, వాకా ప్రసాద్, నడ్డి నారాయణ, తోట వేంకటేశ్వర్లు, డాక్టర్ మస్తానమ్మ, మల్లేశ్వర రావు, గొడుగు చింత గోవిందయ్య, జిల్లేళ్ల బాలాజీ, ఉషారాణి పాల్గొన్నారు.

17 నుంచి ప్రసన్నుడి పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : అప్పలాయిగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. 16న అంకురార్పణ నిర్వహించనున్నట్లు పేర్కొంది. ప్రతి రోజూ దేవదేవేరులకు స్నపన తిరుమంజనం జరిపించనున్నట్లు వివరించింది.

జగనన్న ఇళ్లపై రాళ్ల దాడి



పగిలిన కిటికీ అద్దాలు, విలపిస్తున్న బాధితురాలు

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రం జగనన్న కాలనీలో ఇళ్లపై శుక్రవారం రాత్రి కొందరు మందుబాబులు రాళ్లతో దాడి చేశారు. వివరాలు.. కాలనీ సమీపంలోని ఖాళీ ప్రాంతంలో మద్యం, గంజాయి సేవిస్తున్న వారిని మూడు రోజుల క్రితం స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు. అయితే తమను పోలీసులకు పట్టించిన వారిపై కక్ష పెంచుకున్న మందుబాబులు రాళ్లతో పలు ఇళ్లపై దాడికి దిగారు. మురళి అనే వ్యక్తి ఇంటితోపాటు మరో రెండిళ్ల కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రశాంత్ అనే యువకుడితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సీఐ చిన్న గోవిందు, ఎస్ఐ షేక్షావలీ మాట్లాడుతూ రాత్రివేళల్లో జగనన్న కాలనీ వద్ద కట్టుదిట్టంగా గస్తీ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రామచంద్రాపురం : మండలంలోని నూతికుంటపల్లెలో పంచమ వేద మహాభారత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఈ మేరకు ఉత్సవ విగ్రహాలను రేఖలచే ను గ్రామంలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి, మంగళ హారతులు పట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. శ్రీవేంకటేశ్వర నాట్య మండలి వారు వీధి నాటికను ప్రదర్శించారు.

చంద్రగిరి కోట సందర్శనపై ఆంక్షలు

చంద్రగిరి : జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహించనున్న క్రమంలో ఆదివారం చంద్రగిరి కోట సందర్శనపై జిల్లా అధికారులు ఆంక్షలను విధిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ చారిత్రక పర్యాటక స్థలమైన చంద్రగిరి కోటను భద్రతా కారణాల దృష్ట్యా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే పర్యాటకులను అనుమతిస్తున్నట్లు తెలిపారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



అధ్యాపకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ఉత్తమ అవార్డు అందుకున్న అధ్యాపకులను గవర్నమెంట్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ వారు శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సత్కరించారు. టీటీడీ పూర్వ విద్యాశాఖాధికారి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం సన్మాన గ్రహీతలైన అధ్యాపకులు డాక్టర్ పి.కుమారి నీరజ, డాక్టర్ ఎం.భాస్కర్‌రాజు, డాక్టర్ ఇ.మహ్మద్ అన్వర్ హుస్సేన్‌కు అభినందనలు తెలిపారు. నేతలు టి.నరసింహులు, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి , డాక్టర్ పి.సుజన, డాక్టర్ మురళి, డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి ,రాజేంద్ర నాయుడు, పైడి అంకయ్య ,డాక్టర్ ధనంజయరెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

ఆలయ కమిటీలో అవకాశానికి డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న రజక సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : తాత్యయ్యగుంట గంగమ్మ ఆలయం పాలక మండలిలో రజకులకు స్థానం కల్పించాలని కూటమిలోని రజక సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు గంగమ్మ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆలయం వద్ద కొబ్బరి కాయలు సమర్పించి పూజలు నిర్వహించారు. వెయ్యికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ప్రదక్షిణ చేశారు. రజక సంఘం నేత అక్కినపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తమకు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. నేతలు సుధాకర్, శంకర్, గంధం బాబు, మునస్వామి, గంధం వెంకటముని, జశ్వంత్, గుణశేఖర్ పాల్గొన్నారు.

అనువాదం ఆవశ్యకతపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లేళ్ల బాలాజీ

తిరుపతి సిటీ : పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అనువాదం- ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కల్పించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత జిల్లేళ్ల బాలాజీ మాట్లాడుతూ మహాభారత అనువాదంతో తెలుగు సాహిత్యం ప్రారంభమైందన్నారు. డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ కస్తూరి, డాక్టర్ శోభ, డాక్టర్ అన్నమ్మ, ఆంగ్ల విభాగాధిపతి వెంకటలక్ష్మి, డాక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఉత్సవమూర్తులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు.